క్లుప్తంగా

పెద్దమ్మతల్లి, సంజీవరాయ స్వామి విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్టించిన పెద్దమ్మ తల్లి

బత్తలపల్లి: గంటాపురం ఎస్సీ కాలనీలో శనివారం పెద్దమ్మతల్లి, సంజీవ రాయస్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. కాలనీకి చెందిన తప్పెట అలివేలమ్మ, పెద్దన్న కుమారులు నరసింహులు, మంజునాథ్ తమ సొంత డబ్బు సుమారు రూ.15 లక్షలతో కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం వేదమంత్రోచ్చారణ నడుమ స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్టించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, తప్పెట కాటమయ్య, తప్పెట ఉపేంద్రబాబు, తప్పెట నాగన్న, తప్పెట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేల్స్‌ఫోర్స్ రంగంలో అవకాశాలు


సేల్స్‌ఫోర్స్ సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

పుట్టపర్తి అర్బన్: మారుతున్న కాలంలో సేల్స్‌ఫోర్స్ రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని సేల్స్‌ఫోర్ ట్రయల్ బ్లేజర్ కమ్యూనిటీ నిపుణులు శ్రీశేష తమలల్ల, అక్షయ, పవన్‌కుమార్ పటేల్,సుఖేష్, సహన, హీరాకోల్కర్, చైత్ర, ఐశ్వర్య పేర్కొన్నారు. పుట్టపర్తిలోని సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు సేల్స్‌ఫోర్స్‌పై శనివారం సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సులో విజయవంతంగా శిక్షణ పొందిన వారికి 6 నెలల్లో ప్లేస్‌మెంట్ అవకాశాలు అందించనున్నట్లు చెప్పారు. సర్టిఫికేషన్ మార్గాలు, ఉపాధి అవకాశాలను క్షుణ్ణంగా వివరించారు. ఇప్పటికే కళాశాలలో పైథాన్, జావాపై శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలియజేసింది.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు

తనకల్లు: గ్రామాల్లో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీపీ వైవీ కౌసల్య అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్య ఉందని, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, డీటీ మల్లికార్జున, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ఉషోదయ'లో కలర్స్‌డే


విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట ఉషోదయ పాఠశాలలో శనివారం కలర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, డైరెక్టర్లు పోలా ప్రభాకర్, సుబ్బారావు, ఇన్‌చార్జ్ బినాయి ఫ్రాన్సిస్, శంషాద్‌బేగం, హెచ్‌ఎం నాగభూషణం పసుపు పండ్లు, కూరగాయల ప్రాధాన్యత తెలియజేశారు. విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి నృత్యాలతో అలరించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

ధర్మవరం: పట్టణంలోని శ్రీసాయికృప జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కలవల మహేష్, జ్వాలా పెద్దిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు భగవంతరెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వసతిగృహం తనిఖీ

ధర్మవరం రూరల్: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ సాంఘిక బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి తహసీల్దార్ సురేష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సదుపాయాలపై వార్డెన్‌తో ఆరా తీశారు. విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు మోత మోగిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పట్టించుకునేవారు కరువయ్యారు. వసతిగృహాల్లో మంచాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. దోమల బెడదతో విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది.


కదిరి బీసీ బాలుర వసతి గృహంలో కూరలు రుచిగా లేకపోవడంతో అన్నం పారబోస్తున్న విద్యార్థులు


బత్తలపల్లిలో బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విరిగిపోయిన మరుగుదొడ్ల తలుపులు

వసతిగృహాల్లో సమస్యల మోత

- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం



నల్లచెరువు: బీసీ బాలుర వసతి గృహంలో మూలనపడ్డ జనరేటర్, ధర్మవరంలో ఒకే దుప్పటిలో నిద్రిస్తున్న ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు

కదిరి అర్బన్: పట్టణంలోని కదిరి– హిందూపురం రోడ్డు పక్కన బీసీ బాయ్స్ హాస్టల్ ఉంది. ఇందులో మొత్తం 140 విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు తాగడానికి బోరునుంచి వచ్చే ఉప్పునీరే గతి. ఇంత వరకు దుప్పట్లు ఇవ్వలేదు. హాస్టల్ అద్దెభవనంలో నిర్వహిస్తుండడంతో సరైన వసతులు లేవు. హాస్టల్‌లో సమస్యలు ఎవరికైనా చెబితే హాస్టల్‌లో నుంచి తీసేస్తామని అధికారులు బెదిరించినట్లు విద్యార్థులు చెప్పడం గమనార్హం.

నల్లచెరువు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సుమారు 90 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే విద్యార్థులకు పడుకోవడానికి ఏర్పాటు చేసిన మంచాలపై బెడ్స్ లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే దుప్పట్లు పరుచుకొని నిద్రపోతున్నారు. వసతిగృహంలో ఆర్వో ప్లాంట్ లేక పోవడంతో విద్యార్థులు తాగడానికి ప్లేట్లు కడగడానికీ హాస్టల్లోని బోరు నీటినే ఉపయోగిస్తున్నారు. వసతి గృహంలో ఉన్న జనరేటర్ పాడై పోవడంతో విద్యుత్ లేనప్పుడు భవనం అంతా చీకటి మయం కావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో 90 మంది దాకా విద్యార్థులున్నారు. హాస్టల్ తాగునీటి వసతి లేకపోవడంతో బిందేలో తెచ్చిన నీటిని తాగాల్సి వస్తోంది. ఇద్దరు ట్యూటర్స్, ఒక వంట మనిషి వసతి గృహంలో ఉన్నారు. వార్డెన్ స్థానికంగా ఉండటం లేదు. కదిరి, నల్లచెరువు, గాండ్లపెంటకు ఒకరే వార్డన్ ఉండడంతో కదిరిలో ఉన్నానని చెప్పారు.

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోనున్న ఎస్సీ బాలుర వసతి గృహంలో మొత్తం 37 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు సరిపడా దుప్పట్లు లేకపోవడంతో రాత్రిళ్లు చలికి వణుకుతూ ఒకే దుప్పటిని ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కప్పుకుంటున్నారు. తాగేందుకు మున్సిపల్ కొళాయి నీరు ఉండటంతో విద్యార్థులు నీరు తాగలేక అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా మనిషి లేకపోవడంతో విద్యార్థులే శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది.

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. పాఠశాలలో 370 మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లు, బాతురూంలు దుర్వాసన వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గదుల్లో కిటికీలకు మెస్ లేకపోవడం వల్ల దోమలు మోత మోగిస్తున్నట్లు వాపోయారు. మరుగుదొడ్లకు కొన్నింటికి తలుపులు విరిగిపోయాయి. మూత్రశాల బ్లాక్ కావడంతో దుర్వాసన వస్తోంది. విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోంది.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో బీసీ బాలికల వసతిగృహంలో 91 మంది విద్యార్థినులున్నారు. ఎనుమలవారిపల్లిలో బీసీ బాలుర వసతిగృహంలో 55 మంది విద్యార్థులు వున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండేది. ప్రస్తుతం వసతులు సరిగా లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బాలికల వసతి గృహ ప్రాంగణం గుట్ట ప్రాంతంలో వుండడంతో అక్కడ ముళ్ల పొదలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో విష పురుగులు సంచరిస్తుంటాయని విద్యార్థినులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంగణంలో విద్యుత్ తీగలు వేలాడుతు ప్రమాదకరంగా ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. అలాగే ఎనుములవారిపల్లిలోని వసతి గృహం అద్దె భవనంలో ఉండడంతో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విద్యార్థులకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారు. మంచాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. దుప్పట్లు లేకపోవడంతో ఇద్దరు కలిసి ఒకటి కప్పుకునే పరిస్థితి ఉంది.

తాడిమర్రి: స్థానిక బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో 30 మంది విద్యార్థులున్నారు. పడుకోవడానికి డార్మెంట్లు లేక విద్యార్థులు నేలపైన పడుకుంటున్నారు. టాయిలెట్లు సరిగా లేకపోవడంతో మల,మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు వసతిగృహం కన్నెత్తి చూడకపోడవంతో సమస్యలు పెరిగిపోయి ఏటేటా విద్యార్థుల ప్రవేశాలు తగ్గిపోతున్నాయి.

సౌకర్యాల కొరత


చెన్నేకొత్తపల్లి బాలుర వసతి గృహంలో ఆరుబయట చదువుకుంటున్న విద్యార్థులు

కనగానపల్లి: రాప్తాడు నియోజక వర్గంలోని పలు బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాల కొరత ఉంది. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో 10 బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు, రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అయితే చాలా చోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు, నీటి వసతులు లేవు. కనగానపల్లి బీసీ బాలుర హాస్టల్లో 200 మంది పైగా విద్యార్థులు ఉండగా, అక్కడ కేవలం ఆరు బాత్‌రూంలు, రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర వసతి గృహంలో కూడా 100 మంది విద్యార్థులు ఉండగా.. అక్కడ కూడా సరిపడా మరుగు దొడ్లు, బాత్‌రూంలు లేవు. ఇక రామగిరి మండలంలో హాస్టళ్లలో సౌకర్యాల కొరత ఉంది.

మోసానికి కేరాఫ్ అడ్రెస్ చంద్రబాబు



డబురువారిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, అమడగూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట, నాయకులు

ఓడీచెరువు: మోసానికి కేరాఫ్ అడ్రెస్ సీఎం చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్ రెడ్డి విమర్శించారు. శనివారం డబురువారిపల్లిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అబద్ధపు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు. హామీలు అమలుచేయపోవడాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు పుట్టపర్తిని గ్యాంబ్లింగ్, వ్యభిచార కేంద్రంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ప్రజలచేత ఆవిష్కరింపజేశారు. జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నరిసిరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి వెంకటరంగారెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, ఎల్లేశ్వర్, రమేష్‌నాయక్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్ నాయుడు, ఆనంద్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, వెంకటనారాయణ, జయచంద్రారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

అమడగూరు: కూటమి ప్రభుత్వంలో మద్యం గ్రామాల్లో ఏరులై పారుతోందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శనివారం అమడగూరులోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్, అన్నదాత సుఖీభవ.. ఇలా ఏ ఒక్క హామీని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. తొందర్లోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా స్వచ్ఛందంగా ఈ కూటమి నాయకుల మోసాలను గుర్తించి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తనకంటి జయప్ప, రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ శేషూరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిభక్తుల్లా, వివిధ అనుసంధాన కమిటీల నాయకులు పొట్టా పురుషోత్తమరెడ్డి, నక్కలచిన్నప్ప, సురేంద్రరెడ్డి, నాగరాజు, మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, సుధాకర్‌రాజు, గంగులమ్మ, హరినాథరెడ్డి, బయమ్మ, ఉత్తప్ప, సూర్యనారాయణరెడ్డి, శంకర, ఆదినారాయణ, రామకృష్ణ, రమేష్, నారాయణస్వామి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

నమ్మించి వంచించిన చంద్రబాబు

తనకల్లు: ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి వంచించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి అన్నారు. బిళ్లూరివాండ్లపల్లిలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ , బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారెంటీ అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని పథకాలు ఎగొట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, సీనియర్ నాయకులు భక్తవత్సలరెడ్డి, సంజీవరెడ్డి, నరేంద్ర, సూరి, బాల్‌రెడ్డి, నిజాం, రెడ్డిపీరా, స్థానిక నాయకులు రవీంద్రారెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి , లక్ష్మీరెడ్డి, షామీర్, చంద్రమోహన్, సుబహాన్, లోకేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సాంబశివారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంజీ, రెడ్డెప్పరెడ్డి, నర్సీరెడ్డి, నరసింహారెడ్డి, రామప్ప, సానే రమణ, అబ్దుల్ రసూల్, బాబాజాన్, శంకర్, బాలకృష్ణ, నరసింహులు, హరినాథ్‌రెడ్డి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


బిళ్లూరువాండ్లపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటి గురుమూర్తికి ఘన నివాళి


ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని కోటి గురుమూర్తి స్మృతివనంలో బీసీ నేత కోటి గురుమూర్తి వర్ధంతి కార్యక్రమం జరిగింది. గురుమూర్తి కుటుంబ సభ్యులు కోటి గురులక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, మమత గురుమూర్తి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం అన్నదానం నిర్వహించారు. గురుమూర్తి కుటుంబ సభ్యులు పూజిత్ గురుశరణ్, యోక్షిత్‌రామ్, షన్విత్ గురునందన్, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే సురేష్, చెడిపోతుల సోమశేఖర్, గవ్వల రమేష్, కొంకా ప్రసాద్, అప్పస్వామి, కుమ్మర వక్కల కృష్ణయ్య, పామాల నారాయణస్వామి, కార్యకర్తలు, కురుబ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువతికి లైంగిక వేధింపులు

తనకల్లు: మండలంలో ఓ గ్రామానికి చెందిన యువతిపై ఓ యువకుడు కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. అతని పద్ధతిలో మార్పు లేకపోవడంతో యువతి తల్లిదండ్రులు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు పరిశీలనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు సూచించారు. జిల్లాలోని 32 పాఠశాల నుంచి 169 మంది విద్యార్థులు, 37 మంది ఉపాధ్యాయులు ఒక్క రోజు విజ్ఞానయాత్రలో భాగంగా శనివారం పట్టణంలోని ప్లానెటోరియం, చైతన్యజ్యోతి మ్యూజియం, బాబా మహాసమాధి, చిత్రావతి రివర్, కల్పవృక్షాన్ని సందర్శించారు కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికార తనూజ, అలెస్కో, అనంద్‌బాబు, ఏఎంఓ అబ్దుల్ మాలిక్, వెంకటరమణ, ప్రవీణ్, సురేష్, లీలావతి పాల్గొన్నారు.

రేపు రెడ్డిపల్లిలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ'

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో సోమవారం ఉదయం 10 గంటలకు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఆలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు


పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి మూల విరాట్


ముదిగుబ్బలో పూజలందుకున్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి


మునగలవారిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ మాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నల్లమాడ మండలం పెద్ద కోట్లపల్లి, రెడ్డిపల్లి, బత్తలపల్లి మండలంలోని పోట్లమర్రి, ధర్మవరంలోని షిర్డీసాయిబాబా ఆలయంలోని ఆంజనేయస్వామి మందిరం, లింగశెట్టిపాళ్యంవీధిలోని అభయాంజనేయస్వామి, కొత్తపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముదిగుబ్బలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాటుసారా తయారు చేస్తున్న మహిళ అరెస్ట్

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం నార్శింపల్లి తండాలో నాటుసారా తయారు చేస్తున్న మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎక్సైజ్ పోలీసులు బుక్కపట్నం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. నార్శింపల్లి తండాలో నాటుసారా తయారు చేస్తున్న అలివేలమ్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. ఎస్ఐ మనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

రామగిరి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డివిజినల్ మెడికల్ ఆఫీసర్ జయరాం, పంచాయతీ కార్యదర్శి సత్తెమ్మ సూచించారు. పేరూరు గ్రామంలో కొన్ని రోజులుగా విషజ్వరాలు ప్రబలడంతో శనివారం వైద్య సిబ్బంది మిలాథియన్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఆశావర్కర్లు, హెల్త్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పుట్టపర్తి: బుక్కపట్నం షాదీఖానాలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు.

కొత్తచెరువు: స్థానిక ఎస్‌ఎల్‌వీ ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

అమడగూరు: గుండువారిపల్లి సమీపంలో ఉన్న

సంక్షిప్త సమాచారం

కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులతో సమస్యలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను, హాజరు పట్టికలను పరిశీలించారు.

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

రామగిరి: దివ్యాంగుల సంక్షేమమే టింబక్టు కలెక్టివ్ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకులు మేరీ వట్టమట్టం, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. శనివారం మండలం కేంద్రంలో ప్రతిభా వికలాంగుల సొసైటీ 17వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురికి ట్రై సైకిళ్లు, ఐదుగురికి వీల్‌చైర్లు, ఒక హ్యాండ్‌స్టిక్, ఏడుగురు విద్యార్థులకు రూ.82,000 ఫెలోషిప్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, సొసైటీ గౌరవ డైరెక్టర్ రమేష్ కుమార్, సిబ్బంది నాగరాజు, పెద్దక్క, జయశ్రీ, గణేష్, నరసింహులు, తులసి తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో జాప్యాన్ని నివారించండి

కదిరి అర్బన్: బదిలీ అయిన ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నివారించాలని డెమాక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నేత షర్ఫోద్దీన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌లాజమ్, మారుతీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో రీ–అపార్షన్మెంట్ కారణంగా మారిన కొత్తక్యాడర్‌కు అనుగుణంగా పొజిషన్ ఐడీలు రాకపోవడంతో ఉపాధ్యాయుల జీతాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అలాగే పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థి

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపికై నట్లు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. శనివారం కళాశాలలో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థి ఎంకే నిఖిల్‌కుమార్‌ను అభినందించారు. నిఖిల్‌కు మార్ త్వరలో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల పీడీ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ధర్మవరం రూరల్: బడన్నపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప కంటికి సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుడు రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. శాంతి భద్రతలు, పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రకాల రికార్డుల నిర్వహణను తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు.